# దృశ్య కావ్యం

గాఢ నిద్రలోంచి మేల్కొన్నాను. గోడ గడియారమై ఉంటుంది, లయబద్ధంగా సద్దు చేస్తోంది. ఆ చప్పుడు మినహా నా చుట్టూ నిశ్శబ్దం. ఇక నిద్ర పట్టే అవకాశం లేదు. నేనున్న పరిసరాలను అంచనా వేస్తున్నాను. వేళ ఎంతై ఉంటుందో, ఏ వారమో, ఏ తారీకో అన్న జిజ్ఞాస మొదలయింది. ఎంత వేళ అయినా నే చేసేదేముంది గనుక! నా సందేహాన్ని తీర్చడానికే అన్నట్లుగా దూరాన కోడి కూసింది. దానికి ప్రతిస్పందిస్తూ ఒక్క క్షణంతర్వాత ఇంకో కోడి ఇంకాస్త దూరం నుండి కూసినట్టు వినిపించింది. నగర మధ్యంలో కోడి కూతలు ఈ రోజుల్లో అరుదై పోతున్నాయి. ఈ దరిదాపుల్లో కోళ్లను పెంచుకునే బీదా బిక్కీ జనాల ఆవాసాలు కూడా ఉన్నాయేమో అనుకున్నాను.

రాత్రి మూర్తితో కలిసి రావడం, అతని నోటివెంట ఉపశమన వచనాలు విని ధైర్యం తెచ్చుకోవడం లీలగా గుర్తుకొచ్చి నిట్టూర్చాను. ఆ క్రితంరోజు పడిన హైరానాతో నిద్ర వస్తోందని అన్నాను. "ఇక్కడే ఈ బాల్కనీలో పడుకుంటావా? గదిలో పడుకోవూ?" అన్నాడు మూర్తి. "ఇక్కడే హాయిగావుంది" అని మంచంమీద వాలాను.

నా కిక తెల్లారేదాకా గడియారం చప్పుడు వింటూ మంచానికంటుకుని పడుకోక తప్పదు. ఎందుకనో నాకు ఆ క్షణంలో చిన్ననాటి జగ్గూ జ్ఞాపకం వచ్చాడు. మా గ్రామంలో మా ఇంటికెదురుగా ఉన్న పెంకుటింట్లోకి ఎవరో కొత్తగా వచ్చి దిగారు. వాళ్ళ పిల్లాడే జగ్గూ. మా ఇంటి పక్కన ఖాళీ స్థలం ఉండేది. అక్కడ పిల్లలమంతా చేరి సాయంత్రం నిశ్చింతగా ఎన్నో ఆటలు ఆడుకునేవాళ్ళం. ఆ జాగాలో ఎవరో ఇల్లు కట్టించడానికి ఇసుక పోయించారు. తడి పొడిగా ఉన్న ఆ ఇసుక మేటు మీద పిల్లలం అంతా చేరి పిచ్చుక గూళ్ళు కట్టుకుని ఆనందిస్తున్నాం. చిన్న జల్లు కురిసింది. నీ రెండలో ఆడుకుంటూ తలెత్తి తూరుపు దిశగా చూశాను. అబ్బో! ఎన్ని రంగులో అని చౌకళించి నా పక్కనే జగ్గూని కూడా చూడమన్నాను. ఇంతలో నా కన్నా పెద్ద పిల్లలు కొందరు అటు చూసి 'అదిగో' హరివిల్లు - అదిగో ఇంద్రధనుస్సు' అని చప్పట్లు చరిచారు.

అంతవరకూ దాన్ని హరివిల్లంటారని నాకు తెలియనే తెలియదు. జగ్గూ మాత్రం నా వేపు బేలగా చూసి 'నాకు కనపడదురా'... అన్నాడు. అదేనేమో తొలిసారి ఇంకొకడి బాధ గురించి నేను ఆలోచించడం.

"అమ్మా? జగ్గూకి హరివిల్లు కనపడదటే" అన్నాను.

"అవునురా. వాడికి ఆ భగవంతుడు దృష్టిని ఇవ్వలేకపోయాడు" అని ఎంతో విచారించింది. అలా నేను జగ్గూతో కలసి ఆడేపాడే అనుభవంలో ఒక విషయం గ్రహించాను. చూపులేనివాడు వినికిడి మీదా, స్పర్శ మీదా ఎక్కువ ఆధారపడతాడని అర్థమైపోయింది.

అలా తెల్లవారు జామున నా చిన్నతనాన్ని నెమరువేసుకుంటూ ఉంటే టకటకమని చప్పుడూ, రెపరెప రెక్కలు కొడుతున్న సందడీ చెవిని పడుతోంది. మధ్య మధ్య చిరుమువ్వల మోతలాటి అరుపుకూడా వినిపిస్తోంది. ఆ శబ్దాలు నాకు బాగా పరిచయమైనవే. ప్రతిబింబాన్ని అద్దంలో చూసుకుని ప్రత్యర్థిగా భ్రమించిన పిచ్చుక దాని ముక్కుతో అద్దాన్ని పొడుస్తున్న సందడే అది.

ఇక బాగా తెల్లారిందనడానికి ఏ మాత్రం సందేహం లేదు. కాకులు ఉండి ఉండి కావు కావుమని అరుస్తూ నిశ్శబ్దాన్ని తమ వంతుగా ఛేదిస్తున్నాయి. ఎదురుగా ఉన్న ఇంటి తలుపు ఎవరో తెరిచినట్టున్నారు. కాస్సేపటికి చుయ్ చుయ్ మని పాత్రలోకి పాలు పిండుతున్న సవ్వడి సంగీతంలా చెవిని పడుతోంది.

"ఇవాళ ఏం వారమే?... ఆఁ... ఆఁ... ఏం వారమే?" అని అడుగుతున్న స్త్రీ కంఠంలో ఏదో జీర, ఏదో నీరసమైన వణుకు. ఆ గొంతు శ్రావ్యంగా లేకపోగా కాస్త కర్కశంగా ఉంది.

ఆ ప్రశ్న వింటూనే నాకు నవ్వువచ్చింది. నేనూ కొన్ని క్షణాల కింద అదే ప్రశ్న - నాలో వేసుకున్నాను. ఏమీ తోచనివేళ మనస్సును మళ్లించడానికి వేసుకునే ప్రశ్నలే అవి. ఆ ప్రశ్నకు జవాబు ఎలా ఉంటుందో అని చెవులు రిక్కించి మరీ విన్నాను.

ప్రతిస్పందన చాలా కటువుగా వచ్చింది.

"ఏ వారమైతే నీ కెందుకే అవ్వా? ఏ ఊరైనా పోవాలా? తెల్లారితే చాలు 'ఎన్ని కొట్టారు, టైము ఎంతయింది? ఏం వారం?' అని అందరి ప్రాణాలూ తోడేస్తావు" ఇదీ జవాబు.

ఇది విన్నాక ఒక పొడి దగ్గూ, సన్నని మూలుగూ, ఒక నిట్టూరుపూ, ఆ తర్వాత 'కృష్ణా! కృష్ణా! దయరాదుకదా' అని వేడికోలూనా చెవిని పడ్డాయి.

"మాట్లాడితే ముత్యాలు రాలిపోతాయటే అమ్మా" అని చిన్నగా సణుగుడు నూతిలోంచి వచ్చిన మాటలాగ గాలిలో కలిసిపోయింది. ఆ సణుగుడు డెబ్బై దాటి ఎనభై దిశగా నడుస్తున్న స్త్రీ దయి ఉండొచ్చు.

రాత్రి మూర్తి నన్ను బాల్కనీలో పడుకోబెట్టి నైట్ డ్యూటీ ఉందని వెళ్తూ ఎంతో ధైర్యం

చెప్పాడు. "మా రంగనాథం వంట రుచి చూస్తే చాలు, నువ్వే ఇంకా రెండు రోజులు ఎక్కువ ఇక్కడ ఉంటానంటావు. పడుకో, ఉదయాన్నే వేడి వేడి టీ కప్పుతో నిన్ను పలకరిస్తాడు. అతను మెట్ల క్రింద గదిలోనే ఉంటాడు. నీకేదైనా రాత్రి కావలసి వచ్చినా మొహమాట పడక అతన్ని పేరు పెట్టి పిలు,వస్తాడు" అని ఎంతో భరోసా ఇచ్చి మరీ వెళ్లాడు. లేచి కాస్త మొహం కడుక్కుందామనే ఆలోచన నాకు రాగానే బాల్కనీ వేపు తలుపుమీద కాబోలు మునివేళ్లతో మృదువుగా తట్టిన చప్పుడయింది.

"మీరు కాఫీ తాగుతారో, టీ తాగుతారో కనుక్కుందామని వచ్చాను" అన్నాడు రంగనాథం. అతని సహాయంతో మొహం కడుక్కుని కుర్చీలో కూర్చుంటూ "నాకు టీ తాగడమే అలవాటు" అన్నాను.

అలా టీ కోసమని ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను కానీ, నా చెవులుమాత్రం గాలిలోని శబ్దాలను జాగ్రత్తగా పోగుచేస్తున్నాయి. నా మనసులో ఏవో రేఖా చిత్రాలు గీసుకుంటున్నాను. నే నున్న బాల్కనీ పక్కనే గేటు తలుపు కీచుమని తెరుచు కున్నట్టుంది.

"ఇంతవరకూ ఆయా రాలేదుకదా. అవసరం ఉన్నరోజునే ఆలస్యం చెయ్యడం వీళ్లకో పాడు అలవాటు. ఎవరొచ్చినా, రాకపోయినా వీధి తలుపు తెరవగానే అరుగు మీద ఇంటికెదురుగా ఈ డర్టీ క్రీచర్ తయారై కూర్చుంటుంది."

ఈ గొంతు వినిపించే భావాలెలా ఉన్నా మాటలుమాత్రం స్పష్టంగా, ఎంతో శ్రావ్యంగా ఉన్నాయి. సుమారు ముప్ఫై ఏళ్ల ముగ్ధ కంఠంలా తోస్తోంది. గొంతులో ఏ మాత్రం జంకూ గొంకూ లేదు. ఎదురుగా మనిషిని పెట్టుకుని అలా ఇంగ్లీషు భాషలో స్తుతివాక్యం పలుకుతున్న ఆమె సాహసానికి ఆశ్చర్యపోతూఉంటే నా సందేహ నివృత్తికే అన్నట్లు ఇంకా ఏదో విసుక్కుంటోంది.

"బ్రహ్మ చెవుడు - కళ్ళు కూడా సరిగ్గా కనపడిచావని మనిషి ఓ వారగా కూర్చోదు. వీధి అరుగుమీద కూర్చుని ఏ నీడ కదిలినా నిలదీసి పలకరింపులూ - ప్రశ్నలూ..."

"ఎవరక్కడ? ఆఁ... ఆఁ... సత్తెమ్మా! ఏమమ్మా పలకవు" అని ముసలి గొంతు ఆరాటపడింది. ఇటునుంచి ఏ జవాబూ లేదు. ముసలి గొంతు మూగబోయింది.

రంగనాథం తెచ్చిన టీ కప్పును జాగ్రత్తగా అందుకుని ఊదుకుంటూ చవి చూశాను. బ్రహ్మాండంగా ఉంది. నీరసంగా ఉన్న నా శరీరంలోకి చైతన్యం ప్రవేశించినట్లయింది. రంగనాథం గురించి మూర్తి అన్న మాటల్లో అతిశయోక్తి ఏమాత్రం ఉండదని అనుకున్నాను. ఇంతలో, వీధిలో ఏదో తత్త్వం వినిపిస్తోంది. 'నా వల్ల నేరమేమిరా రామా' అని ఏదో పల్లవి. రామదాసు కీర్తనలా ఉంది. ఆ ముసలామెదే ఆ ఆలాపన. గొంతులో జీర. వణుకుతున్న ఆ గొంతు కర్ణకఠోరంగా ఉంది. మధ్య మధ్య పొడి దగ్గు. చిన్నమూలుగు. "కృష్ణా కృష్ణా"

అని ఒక పెద్ద అరుపు. "ఇవాళ సోమవారమే కదే వనజా?" అని అంతలోనే ప్రశ్న. దానికి ఇంకా జవాబు లేదు.

ఖాళీ టీ కప్పును చేతిలోంచి అందుకుంటున్న రంగనాథాన్ని - "ఆ గొంతు ఎవరిది?" అని నేను అడిగాను. అతను జవాబు చెప్పేలోగా ఆ ముసలామె ప్రశ్నకు జవాబు వినిపించింది.

ఎవరో యువతి - "నే నిప్పుడు నీకు జవాబు చెబుతూ కూర్చోలేను. పిల్లల్ని స్కూళ్ల కి తెమిల్చి పంపాలి. ఆ గడపమీద ఒక వారగా కూర్చుని రామాకృష్ణా అనుకో" అని మృదువుగా మందలిస్తోంది.

"సరిలెండే. నాతో మీ కేమి మాటలు. ఒక్క మాట ఎక్కువైతే ముత్యాలు రాలిపోవూ" అని గాఢంగా నిట్టూర్పు.

"మన ఇంటికి ఎదురుగా ఉన్న కంట్రాక్టర్ గారికి ఆమె దూరపు బంధువు. భర్త పోయాడు. నా అన్నవాళ్లు ఎవరూ చూడకుండా వదిలేస్తే ఇక్కడే ఉండిపోయింది. సరిగ్గా వినపడదు. మసకమసగ్గా కనిపిస్తుంది. ఎవరు వీధిలో నీడగా కదలాడినా 'ఎవరూ?' అని నిలదీస్తుంది. మంచి మనిషే కానీ ముచ్చటలాడుతూ కూర్చునే తీరిక ఎవరికుంటుంది...?" జాలిగా రంగనాథం వివరించాడు.

'ఇవాళ పత్రిక వచ్చిందా?' అని రంగనాథాన్ని అడగాలనుకుని పిలిచాను. క్రిందకు వెళ్లిపోయినట్లున్నాడు. "పిలిచారా?" అని దూరం నుంచి అడిగాడు.

"అబ్బే - రావద్దు. నీ పని చూసుకో" అని వారించి, నా ఆలోచనకు నేనే నవ్వుకున్నాను. పత్రిక వచ్చినా ఏం చేసుకోను? వ్యక్తి జీవితం మీద అలవాటుకున్న పట్టు ఎంత బలమైనదో అని ఆశ్చర్యపోయాను.

పక్కింటి ఆవరణలోంచి కంచు కంఠం స్పష్టంగా వినిపిస్తోంది. "సత్తెమ్మా? ఇలా ఇంత ఆలస్యంగా వస్తే నా కేం ఉపయోగం? నేను ఆఫీసుకి తొందరగా వెళ్లాలి. బబ్లూకి ఇవాళ పరీక్ష. మధ్యాహ్నం వేగంగా వచ్చేస్తాడు. నువ్వు పోయి తీసుకురావాలి" అని గట్టిగా జాడిస్తోంది.

"మా పెదనాయిన బీమారున్నాడు. దావఖానలుంటె జూసొచ్చిన" అని కీచు గొంతు స్వరం తగ్గించి సమాధానపరుస్తోంది. అది సత్తెమ్మ గొంతుకై ఉండాలి. వినయంగానే ఉంది.

"సారీ - రాఘవా నిన్న నైట్ డ్యూటీ. ఇవాళ మధ్యాహ్నం మా క్లినిక్‌లో ముఖ్యమైన సమావేశం ఒకటి ఉంది. నీతో ఎక్కువగా గడపలేక పోతున్నాను" అని క్షమాపణ చెప్పుకునే ధోరణిలో మూర్తి వచ్చి పలకరించాడు. రంగనాథం అక్కడ చేస్తున్న హడావిడి అంతా వింటే మా ఇద్దరి మధ్యా ఉపాహారం సిద్ధంగా ఉంచినట్టున్నాడు. మూర్తి నాలోని ఉత్కంఠను అర్థం చేసుకున్నట్టు లేదు. తన పనుల బరువులో పరాకు పడ్డాడో ఏమో "కంటి డాక్టర్

ఏమన్నాడు?" అని నేనే మూర్తిని కదిపాను.

"ఇంత వరకూ అసలు విషయం చెప్పకుండా అనవసరమైన మాటలు చెప్తున్నాను. 'నీ కళ్లకు ఏ విధమైన ప్రమాదమూ లేదు. చూపుకి ఏ లోపం రాదు' అని డాక్టర్ స్పష్టంగా చెప్పాడు. ఇనుప రజను కళ్లలోంచి సులభంగానే తీసివేశారట. ఇన్ఫెక్షన్‌కి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా జాగ్రత్త కోసం చుక్కలు వేసి పూర్తి విశ్రాంతి కోసం కట్టు కట్టారట... మూడు రోజుల్లో కట్టు విప్పుతానన్నాడు" మూర్తి ఏకధాటిగా ఉత్సాహంతో చెప్పాడు.

ఆ మాటలు నాకెంతో ఊరట కలిగించాయి. నాకు మళ్లా జీవితం మీద -ఆశ కల్పించాయి. తృప్తిగా మా మధ్య వేడి వేడిగా ఉన్న ఇడ్లీ తినడం పూర్తి చేసి కాస్త సేపు పాత ముచ్చటలు చెప్పుకున్నాం. మా ముచ్చట్లలో జగ్గూ ప్రసక్తి కూడా వచ్చింది.

"రంగనాథం నిన్ను జాగ్రత్తగా చూసుకుంటాడు. నేను కాస్త నా పని చూసుకు వస్తా" అని తన గదిలోకి వెళ్లిపోయాడు మూర్తి. నేను బాల్కనీలోని కుర్చీలోకి జాగ్రత్తగా చేరుకున్నాను. అలా అక్కడి శబ్ద ప్రపంచంలోకి ప్రవేశించి నా రేఖా చిత్రాలనీ, నాకు పరిచయమైన పాత్రలనీ వెతుక్కుంటున్నాను.

ఇంతలో శ్రావ్యంగా ముగ్ధ కంఠం చెవిని పడింది. మాటల్లో స్పష్టతా, గొంతులో ఒక విధమైన అధికారదర్పం ధ్వనిస్తోంది. ఆ స్వరంలో వింత ఆకర్షణ కూడా లేకపోలేదు.

"ఇవాళ బబ్లూని మధ్యాహ్నం వెళ్లి తీసుకురావడం మరచిపోకు. నేను వెళ్లడానికి కుదరదు, స్కూలు వేగం విడిచిపెడతారు. ఎండవేళ ఆడనియ్యకు. వీధి చివర ఉన్న ఆ చందూ గాడితో కలిసి ఆడినా, ఎదురింటి ముసలిదానితో మాటలాడినా నే నూరుకోనుసుమా - ఆ బాధ్యత నీదే.

వీడియో టేపులు ఆ టేబిల్ మీద ఉంచాను. అవి చూపించి ఇంట్లోనే ఆడుకోమను. ఇవాళ మా ఆఫీసుకి ఆడిట్ వాళ్లు వస్తున్నారు. ఈ రోజే అయ్యగారికి డైరెక్టర్ల మీటింగ్ ఉంది".

గల గల ప్రవాహంలా వచ్చిపడుతున్న అమ్మగారి ఉత్తరువుల్ని శ్రద్ధగా అందుకుంటూ కీచుగొంతుతో నెమ్మదిగా భరోసా ఇస్తున్న కంఠం ఆ సత్తెమ్మదే అనుమానం లేదు.

"బబ్లూ? నా మాట వింటున్నావా? ఇవాళ ఆయా నిన్న స్కూలు నుంచి తీసుకొస్తుంది. బట్టలు మార్చుకుని ఇంట్లో టామ్ అండ్ జెర్రీ, డోనాల్డ్ డక్, జంగిల్ బుక్ చూస్తూ ఆడుకో. అల్లరి చెయ్యకుండా ఉంటే సాయంత్రం నీకు ఐస్‌క్రీమ్ తెస్తాను. కాల్షియం శాండోజ్ మాత్ర ఆయా ఇస్తుంది వేసుకో. టైమ్ అయిపోయింది - పద - కూర్చో. ఆయమ్మా! ఆ బాగ్, బబ్లూది తీసుకొచ్చి కారులో పెట్టు...".

కారు కదిలిన చప్పుడు. ఆ తర్వాత ఒక గాలి వాన వెలసిన ప్రశాంతి. ఆయా గేటు

వేసినట్టుంది. పది నిముషాలపాటు ఏమీ తోచక నా కుర్చీలో అలా కూర్చుని కూనిరాగం తీస్తున్నాను. ఇంతలో వీధిలో సందడి వినిపించింది. చక్రాల బండి తోసుకొస్తున్నట్టుంది - ఎవరో.

"ఎవరది? ఆఁ ఆఁ ఎవరూ?" బండి ఆగిన శబ్దం. "ఎవరంటే పలకరు" ముసలామె ఇంకా స్వరం పెంచి అడుగుతోంది. ఆ ప్రశ్నకు జవాబు చెప్పే బాధ్యత లేనట్టు చిన్నగా నవ్వు. నవ్వు ఆగిన తర్వాత తానెవరో చెప్పుకుందుకే అన్నట్టు "టమాటాల్, బీనీస్, వంకాయ, కాబేజీ, బెండకాయ..." గొంతు చించుకుని ఏకరువు పెడుతున్నాడు కూరల బండి వాడు కాబోలు.

ముసలామె నిరుత్సాహ పడినట్టు లేదు.

అయితే గొంతులో ఎంతో మార్దవం తెచ్చుకుని -

"కూరగాయలు తెచ్చావా? మాటాడితే ఏం పోయింది పోచయ్యా?" అని మందలిస్తోంది.

"నేను మాట్లాడినా నీకు ఇనపడదు గదమ్మా" అంటున్నాడు కూరలవాడు స్వరం గట్టిగా పెంచి.

"మరి నీ కూరగాయల పేరు జెప్పి అరవడం లేదా?" అని ముసలామె చిన్నగా నవ్వుతోంది.

ఆమె మాటకారితనానికి కూరలవాడు పగలబడి నవ్వితే ముసలామె కూడా నవ్వుతోంది. ఆమె దైనందిన జీవితంలో ఇదెంతో సంతోషాన్ని పంచే క్షణంలాగ నా కనిపించింది. ఇద్దరి నవ్వూ అలా వినిపిస్తూనే ఉంది కొంత సేపటి వరకూ.

మధ్యాహ్నం భోజనం పూర్తి అయింది. రంగనాథానికి నలుడనో, భీముడనో బిరుదు ఇవ్వడం న్యాయం అనుకున్నాను. ఆ మాటే హడావిడిగా భోజనం చేస్తున్న మూర్తితో అన్నాను. నా భోజనం నెమ్మదిగా సాగవలసిందే. మూర్తితో పోటీపడలేనుకదా. మూర్తి హాయిగా నవ్వి "అందుకే నిన్ను అతనికి అప్పజెప్పి వెళ్తున్నాను. నెమ్మదిగా భోజనం చెయ్యి" అని వెళ్లిపోయాడు.

భుక్తాయాసంతో ఒక గంట మంచి నిద్రతీశాను. ముసలామె "కృష్ణా - కృష్ణా" అని రెండు గావుకేకలు వేసింది. ఆ అరుపుకి పసిపాపలు జడుసుకుంటే ఆశ్చర్యంలేదు. ఎదురుగా నిలబడ్డ మనిషితో మాట్లాడినట్టు కృష్ణుణ్ణి నిలదీసి 'నీకెప్పుడు దయ కలుగుతుందయ్యా?' అని అడుగుతోంది. ఆ అరుపుకే నా మగత నిద్ర చెదరిపోయినట్టుంది. ఇంతలో బాల్కనీ పక్కనున్న ఇంటి ఆవరణలో ఏదో సందడిగా ఉంది. ఆయా సత్తెమ్మ గొంతులా కీచుగా వినిపిస్తోంది. ముసలామెకూడా ఉత్సాహంగా గొంతు సవరించుకుంది.

"మీ అమ్మగారేమో ఇవాళ పొద్దున్నే కారులో పోయింది. నువ్వేమో ఇప్పుడు పోయి

బబ్బులు బాబుని తీసుకొచ్చావు. నేనంతా చూస్తూనే ఉన్నాను. నా కళ్లు పూర్తిగా మూసుకుపోలేదు. సత్తెమ్మా! నీకేమైనా న్యాయమా? ముసిల్దాన్ని పలకరిస్తే ముత్యాలు రాలిపోతాయని భయమా?" అని నిలదీసి సత్తెమ్మని అడుగుతోంది.

సత్తెమ్మ గొంతులో ఎంతో మార్దవం చోటుచేసుకుంది. "పిల్లగాడొచ్చిన సంది నిలవనియ్యడు - కూసోనియ్యడు గదమ్మా. గేటులోనే ముఖం ఇరికించుకుని రోడ్డు మీదికురుకుతానంటడు. నీ గొంతు చెవిని బడితే నా నౌకరి పాయె - ఎంత బదనాము - ఏం జెయ్యాలె..." కీచుగా, గట్టిగా అరుస్తూ మనస్తాపాన్ని వివరిస్తోంది.

మధ్య మధ్య గట్టిగా కాలితో బంతిని తన్ని ఆడుతున్నట్టున్నాడు బబ్లూ. ఉండి ఉండి 'కిషణా - కిషణా' అని లేత గొంతుతో కేకలు వేస్తున్నాడు. ఆ అనుకరణ ధ్వనికి సత్తెమ్మ నవ్వుతూ ఉంటే, ముసలామె ఎంతో విరగబడి నవ్వుతోంది. నవ్వులో ఏ మాత్రం మార్దవం లేదు. కానీ అవ్యక్తానందం పుష్కలంగా ధ్వనిస్తోంది.

"ఆయమ్మా! తలుపు తియ్యవూ?" అని పసివాడి అభ్యర్థన. మధ్య మధ్య ఇంగ్లీష్ రైమ్ ఏదో కాని చిన్నగా, తియ్యగా అస్పష్టంగా వల్లిస్తున్నాడు.

"నా చేత్తో ఎందరు పిల్లల్ని చేరదియ్యలేదు? ఎందర్ని ఎత్తుకోలేదు? మీ దొరసాని ఒక్కతే పిల్లగాణ్ణి కన్నదా ఈ ప్రపంచంలో? సత్తెమ్మా చిన్నపిల్లలు మట్టిలో ఆడక మానుమీద ఆడతారా?" విరక్తిగా ముసలామె సణుగుతోంది. వీధిలోకి పోయి ఒక్కమారు ఆడుకుని వస్తానని మారాం చేస్తున్న పసివాడిని ఎలాగో సమాధానపరిచి ఇంట్లోకి తీసుకుపోయినట్టుంది సత్తెమ్మ. కొంతసేపు ప్రశాంతంగా ఉంది.

రెండు రోజుల తర్వాత ఒక మధ్యాహ్నం నిద్రలేచి బాల్కనీలోకి పోయి నిల్చున్నాను. నా కళ్లకు గంతలు విడిన రోజు కావడం వలన ఆనందానికి అవధుల్లేవు. ఆ ఆనందంలో ఒకమారు అంతర్ముఖంగా నా మీద వారం రోజుల క్రిందట వాలిన దురదృష్టాన్ని నెమరువేసుకున్నాను.

ఏదో పని మీద రాకరాక భాగ్యనగరం వచ్చాను. రోడ్డున పడి పోతూ పోతూ ఉన్నవాణ్ణి తిన్నగా పోక ఆగి, కొత్తగా కడుతున్న సినిమా థియేటర్ అందాన్ని చూస్తున్నాను. దగ్గరగా ఏదో వెల్డింగ్ పని జరుగుతున్నదన్న స్పృహ లేకుండా నా ఉనికినే మరచి పరధ్యానంగా ఉన్నాను. కళ్లలో ఏదో ధూళి పడినట్లయి రెండు కళ్ళూ భగ్గుమంటే మూసుకున్నాను. అక్కడున్న పెద్ద మనిషి ఎవరో కానీ నన్ను ఆసుపత్రికి తీసుకెళ్ళి పుణ్యం కట్టుకున్నాడు. కీడులో కూడా కొంత మేలు జరగడం అంటే ఇదేనేమో మరి! ఆ సమయంలో ఆసుపత్రి మెట్లు దిగుతూ మూర్తి నన్ను గుర్తు పట్టాడట. అంతే - ఇక నన్ను ఆదుకుని అన్ని వైద్య సదుపాయాలూ కల్పించి నలగనివ్వకుండా తన ఇంటికి తెచ్చుకున్నాడు.

"నా భార్య పుట్టింటి కెళ్లిన సమయంలో వచ్చావు రాఘవా! ఈ మారు సతీసమేతంగా వచ్చి మాతో సరదాగా గడపాలి సుమా! నా శ్రీమతి పర్యవేక్షణలో రంగనాథం వంట ఇంకా రుచిగా ఉంటుంది" అని తియ్యని ఆహ్వానాన్ని కూడా మూర్తి నాకు అందించాడు.

కంటికి కట్టిన గంతలు విడిపోయిన రోజది. ప్రపంచాన్ని హాయిగా చూడగలుగుతున్నాను. మధ్యాహ్న భోజనం తర్వాత కునుకు తీశాను. తర్వాత అలా బాల్కనీలోకి వెళ్ళి చుట్టూరా కలయచూశాను. రేఖా మాత్రంగా ఇన్నాళ్లూ నే గీసుకున్న చిత్రాలకు వెలుగు నీడలూ, వాస్తవమైన రంగులూ అద్ది చూసుకోవాలన్న కోరిక కలిగింది. మూర్తి నివాసానికి పక్కనే విశాలమైన ఆవరణలో ఇల్లు ఆధునాతనంగా, అందంగా ఉంది. చుట్టూ కాంపౌండ్ గోడ- ఇంటి ముందు పెద్ద గేటు. ఆ గేటులోనే చిన్న తలుపు కూడా ఒకటి అమర్చి ఉంది. కారు వచ్చిపోవడానికి వీలుగా పెద్ద గేటూ, ఇతర సమయాల్లో మనుషుల రాకపోకలకు వీలుగా ఆ చిన్న తలుపూ అమర్చుకున్నట్టున్నారు. వీధి చివర ఇద్దరు ముగ్గురు పిల్లలు గోలీకాయలతో ఆడుకుంటున్నారు. ఇంకాస్త దూరాన కొన్ని ఇరుకైన చిన్నచిన్న ఇళ్లూ, పాకలూ కనిపిస్తున్నాయి.

మూర్తి ఇంటి పక్కనే ఉన్న గేటుకి సుమారుగా ఎదురుగా అరుగు మీద ఒక విచిత్రమైన మానవాకారం ఉంది. నల్ల తుమ్మరంగు శరీరం, కావిదేరిన తెల్లచీర కట్టుకుని ఉంది. తల ముగ్గు బుట్టలా పండిపోయింది. చేతికి మెరుపు మాసి నల్లబడి పోయిన వెండి మురుగులు, కళ్లకి పాతకాలపు సోడాబుడ్డి అడుగును పోలిన మందంతో సులోచనాలు, సుమారు ఎనభైకి ఎదురు నడుస్తున్న ఆ శాల్తీ భయంకరంగానే ఉంది. మధ్య మధ్య "కృష్ణా! ఓ కృష్ణా!" అంటూ ఆమె పెట్టే గావు కేకలు అలవాటు పడని పసివాళ్లెవరైనా ఉంటే వాళ్లని హడలు కొడతాయి. సందేహం లేదు. అశోకవనంలో సీతమ్మ వనవాసం వర్ణ చిత్రం నా చిన్నతనంలో చూసిన జ్ఞాపకం ఉంది. అందులో సీతమ్మను కావలికాస్తున్న రక్కసి బొమ్మ జ్ఞాపకం వచ్చింది. మృదువైనదీ- సున్నితమైనదీ అని చెప్పుకోదగ్గదేదీ కనపడదు ఆ ఆకారంలో.

ఆమెకు సుమారుగా ఎదురుగా ఉన్న గేటు కటకటాలలో మొహాన్ని ఇరికించి చిన్నమొలకలా ఉన్న పిల్లడు బాహ్య ప్రపంచాన్ని ఎంతో ఆశగా చూస్తున్నాడు. వీడే అయి ఉంటాడు ఆ బబ్లూ అని వెంటనే ఊహించి కాస్త నిరాశపడ్డాను. కారణం లేకపోలేదు. కాటుక కళ్లు జ్యోతుల్లా మెరుస్తున్నాయి తప్ప పిల్లడు మాత్రం గాలీ, నీరూ ఎండా సోకని మొలకలా నీరసించి ఉన్నాడు. ఉగ్గు పాలతోనే ఐశ్వర్యాన్ని రంగరించి పోస్తున్న ఉమ్మడి సంపాదనలో ఆ బబ్లూ ఎంతో బలంగా మిసమిసలాడుతూ పిల్లవస్తాదులా ఉంటాడనుకున్నాను.

అలా చూస్తూ ఆలోచిస్తున్న సమయంలో రంగనాథం టీ కప్పు తెచ్చి అందించాడు. అందుకుందుకు వెనక్కు తిరిగానో లేదో సైకిల్‌గంట చిన్నగా మ్రోగింది. గేటులో చిన్న

తలుపు తెరిచిన చప్పుడైంది. కాకీ బట్టలలో ఉన్న మనిషి ఏవో కవర్లూ, ఉత్తరాలూ మధ్య వయస్కురాలికి అందిస్తున్నాడు. ఆమే ఆయా సత్తెమ్మ అయి ఉంటుంది. అతి శ్రద్ధగా ఆ కవర్లూ, ఉత్తరాలూ అందుకొంటోంది. ఆ ఒక్క క్షణం నాకు చాలని అనుకున్నట్టున్నాడు, ఆ పసివాడుకాస్తా వీథిలోకి జారుకున్నాడు. ఎదురుగా ఉన్న అరుగు మీదికి చెంగున ఉరికి "కిషణా కిషణా" అనుకుంటూ ఆ ముసలమ్మ ఒడిలో వాలిపోయాడు.

"నాయనే, నా బాబే! నా మీద దయ కలిగిందిరా భడవా? నన్ను వెక్కిరిస్తావురా?" అని వాటేసుకుని ముద్దులతో ముంచేసింది. ఒక సముద్రపు కెరటం ఉవ్వెత్తుగా ఎగసిపడినట్టయింది. పసివాడా వెల్లువలో కరిగిపోయాడు. సత్తెమ్మ కంగారుపడిపోతూ వీథిలోకి వచ్చేలోగా నా కళ్ల ముందు కదలాడిన ఆ కలయిక కమ్మని దృశ్య కావ్యంగా నిలిచిపోయింది.

(ఆంధ్రప్రభ, సచిత్ర వారపత్రిక 3-1-1995)